హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్

నిజాం సంస్థానంలో ఆనాడు ఎవరూ పాలనా సంస్కరణల్ని కోరినా నవాబులు దానిని మతపరమైన అంశంగా చిత్రీకరించే వారు. దాంతో 1930వ దశాబ్దిలో మత ప్రమేయం లేని ఒక రాజకీయ సంస్థ ఆవిర్భావం ఆవశ్యకమైంది. ఆ అవసరాన్ని తీరుస్తూ వెలిసిందే 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్'. 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆరో ఆంధ్ర మహాసభ ఈ హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అవసరాన్ని తొలిసారి గుర్తించింది. స్వామీ రామానంద తీర్థ ఈ సంస్థ స్థాపనకు ప్రధాన కారకులు.

1938, జనవరి 29న ఈ కాంగ్రెస్ స్థాపనకు సంబంధించిన మౌలి కాంశాలపై ఒక అవగాహన కుదిరింది. 1938, సెప్టెంబర్ 9న ఒక మహాజన సభా సమావేశాన్ని జరిపి అందులో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. కానీ, ఈ సమావేశం ముందు రోజు 1938, సెప్టెంబర్ 8న అప్పటి హైదరాబాద్ ప్రధాని సర్ అక్బర్ హైదర్ ఈ సంస్థను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలా హైదరాబాద్ సంస్థానంలోనే కాదు బహుశా దేశంలోనే ఆవిర్భావానికి ముందే నిషేధానికి గురైన సంస్థగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిలిచింది. నిజానికి 1938లోనే ఈ కాంగ్రెస్ స్థాపన జరిగిప్పటికీ 1946 జూలై వరకు నిషేధం ఉండటం వల్ల అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంది. అయినా గణనీయమైన ప్రభావాన్ని చూపింది.

నిషేధాన్ని ఎత్తివేయాలంటూ కాంగ్రెస్‌కు చెందిన తాత్కాలిక కమిటీ నిజాం ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిర్ణయించింది. అందులో భాగంగా బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ మత సంస్థ కాదని ప్రభుత్వానికి తెలియజేస్తూ చర్చలు నిర్వహించారు. మరోవైపు మందుముల నరసింగరావు అప్పటి ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పక్షపు నాయకుడైన బహదూర్ యార్‌జంగ్‌తో సంభాషణల్ని కొనసాగించాడు. వీటినే యూనిటీ టాక్స్ లేదా ఐక్యతా సంభాషణలు అంటారు. వీటి ఆధారంగా అప్పటి సంస్థానంలోని రాజకీయ వ్యవహారాల శాఖ కార్యదర్శి నవాబ్ అలీయావర్ జంగ్ స్టేట్ కాంగ్రెస్ పేరు నుంచి కాంగ్రెస్ అనే పదాన్ని తొలగించాలని షరతు విధించాడు. దానికి కాంగ్రెస్ నాయకులు అంగీకరించలేదు.

ఈ నేపథ్యంలో అహింసాయుత సత్యాగ్రహం ద్వారా మాత్రమే నిషేధాజ్ఞల్ని తొలిగింప చేసుకోవాలని కాంగ్రెస్ ప్రతినిధులు భావించారు. 1938 అక్టోబర్‌లో సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ సంవత్సరం అక్టోబర్ 24న రావి నారాయణరెడ్డి, రామకృష్ణదూత్, జనార్దనరావు దేశాయ్, గోవిందరావు నానల్‌లతో కలిసి స్వామీ రామానంద తీర్థ సత్యాగ్రహం చేశారు. వీరిలో సత్యాగ్రహోద్యమ మొదటి డిక్టేటర్(నియంత)గా స్వామీ రామానంద తీర్థ ప్రసిద్ధికెక్కారు.

18 జట్లుగా 400 మంది సత్యాగ్రహులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. అందర్నీ ఎప్పటికప్పుడు నిజాం ప్రభుత్వం అరెస్టు చేసింది. చిట్ట చివరి జట్టుకు కాశీనాథ్ వైద్య నాయకుడు. ఈయన చివరి (18వ) నియంత. అయితే గాంధీజీ ఆదేశానుసారం 1938, డిసెంబర్ 24న సత్యాగ్రహాన్ని నిలిపి వేశారు. సత్యాగ్రహోద్యమాన్ని మతపరమైనదిగా ప్రభుత్వం వ్యక్తీకరించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గండి కొట్టడానికే గాంధీజీ ఈ ఆదేశాన్ని ఇచ్చారు. సత్యాగ్రహుల్ని విడుదల చేయమంటూ సర్ అక్బర్ హైదర్‌కి గాంధీజీ ఒక లేఖ కూడా రాశారు. ఈ కోరికను మన్నిస్తూ సత్యాగ్రహుల విడుదల జరిగింది. అయితే స్టేట్ కాంగ్రెస్‌పై ఉన్న నిషేధం మత్రం కొనసాగింది.

సంస్థానంలో రోజురోజుకీ పరిస్థితులు విషమిస్తూ వచ్చాయి. డాక్టర్ పట్టాభి సీతారామయ్య, నారిమన్ వంటి వారిని సైతం సంస్థానంలోకి రాకుండా నిజాం ప్రభుత్వం ఆంక్షలు విధించింది. తాను పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు హైదరాబాద్‌కు వస్తానని సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్వయంగా సర్ అక్బర్ హైదర్‌కు లేఖ రాశాడు. అయితే, హైదర్ సాకులు చెప్పి పటేల్ రాకుండా చేశాడు. హైదరాబాద్ సందర్శన విషయంలో జమ్నాలాల్ బజాజ్ చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి.

1939-40లో స్టేట్ కాంగ్రెస్ ప్రతినిధిగా కాశీనాథరావు వైద్య నిషేధం తొలగింపు విషయమై ప్రభుత్వంతో రాయబారాలు సాగించాడు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పేరును హైదరాబాద్ నేషనల్ కాన్ఫరెన్స్‌గా మార్చడానికి కూడా సిద్ధమని ఆయన తెలియజేశాడు. దీనికి కూడా నిజాం ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదు. జవహర్‌లాల్ నెహ్రూ ఈ పేరు మార్పును తొలుత సూచించారు.

స్టేట్ కాంగ్రెస్ పేరును మార్చే విషయంలో ప్రభుత్వం ఆ సంస్థతో రాయబారాలు సాగిస్తున్న కాలంలోనే ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీని బలపరిచే స్థానిక పత్రిక 'రహబర్-ఇ-దక్కన్' పేరు మార్పిడి వల్ల లాభం లేదని, ఆ సంస్థ మూల భావన ముస్లింల శ్రేయస్సుకు భంగకరమని, అందులో మార్పు రావాలని పేర్కొంది. సంస్థానపు ఇస్లామిక్ స్వభావానికి భంగం కలిగించే ఎలాంటి చర్యకైనా హిందువులు పూనుకుంటే సహించేది లేదని హెచ్చరించింది.

1940, డిసెంబర్ 1న సమావేశమైన అంజుమాన్ ఇత్తెహాద్-ఉల్-ముస్లిమీన్ ఒక తీర్మానం చేసింది. 'స్టేట్ కాంగ్రెస్‌పై నిజాం ప్రభుత్వం ఎంతో వివేకంతో, ముందు చూపుతో విధించిన ఆంక్షను ఇప్పుడది ఏదో పేరు మార్పిడి నెపంతో రద్దు చేస్తే స్టేట్ కాంగ్రెస్ ఉనికిని నిష్పలం చేసే ప్రతిచర్యను అంజుమాన్ తీసుకుని తీరుతుంది' అని ఆ తీర్మానంలో పేర్కొంది. ఈ తీర్మానాన్ని బలపరిచే ఒక ఫర్మానాను నిజాం ప్రభుత్వం జారీ చేయడం విశేషం.

మరోవైపు అదే సమయంలో స్వామీ రామానంద తీర్థ సేవాగ్రామ్‌కు వెళ్లి మహాత్మాగాంధీని కలుసుకుని ఆయన అనుమతితో 1940, సెప్టెంబర్ 11న హైదరాబాద్‌లో వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. ఆయనను ప్రభుత్వం అరెస్టు చేసింది.

ఈ పరిస్థితుల్లో-1942, మార్చి 22న క్రిప్స్ రాయబార వర్గం భారతదేశంలో అడుగుపెట్టింది. క్రిప్స్ సూచనల ప్రాతిపదికగా ఒక

స్వతంత్ర రాజ్యంగా తాను వ్యవహరించడానికి తనకు హక్కు ఉందనే ట్లుగా హైదరాబాద్ సంస్థానం వ్యవహరించింది. అయితే క్రిప్స్ రాయ బారాన్ని గాంధీజీ, భారత జాతీయ కాంగ్రెస్ తిరస్కరించడం జరిగిం ది.

క్రిప్స్ రాయబారాన్ని తిరస్కరించిన తర్వాత శాసనోల్లంఘన ఉద్య మాన్ని తిరిగి మొదలు పెట్టాలని భారత జాతీయ కాంగ్రెస్ 1942, ఆగస్టు 9న తీర్మానించింది. అదే 'క్విట్ ఇండియా ఉద్యమం'.